క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన



రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలోని ఎస్సీకాలనీలో దెబ్బతిన్న తాగునీటి పైపులైన్‌కు మరమ్మతు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ మంగళవారం మహిళలు రోడ్డుపై ఆందోళన చేశారు. ఆమిదాలగొంది గ్రామం మీదగా పావగడకు కేబుల్ వైరు వేసే సమయంలో పలు చోట్ల తాగునీటి పైపు లైన్ దెబ్బతినిందని మహిళలు పేర్కొన్నారు. దీంతో రోజూ తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గ్రామ కార్యదర్శి రాజేష్ అక్కడికి చేరుకుని బుధవారం లోపు పైపులైన్ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని సర్పంచ్ గీత హామీ ఇచ్చారు.

రేషన్ దుకాణాలు 15 వరకూ తెరచి ఉంచాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

లేపాక్షి: గ్రామాల్లో చౌకదుకాణాలను ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకూ తెరిచి ఉంచాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎఫ్‌పీ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల నుంచి చౌక దుకాణాల ద్వారానే రేషన్ పంపిణీ చేయాలని తెలిపారు. కార్డు వినియోగదారులకు సక్రమంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ మోహన్‌నాయక్, డీలర్లు పాల్గొన్నారు.

వేగంగా పంట రుణాల రెన్యూవల్స్

లేపాక్షి: మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులు రుణాలు రెన్యూవల్స్ వేగంగా చేసుకుంటున్నారని బ్రాంచ్ మేనేజర్ విజయబాబు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజనల్‌లో 2,700 మంది రైతులు పంట రుణాలు పొందగా ఇప్పటి వరకు 1200 మంది రైతులు రెన్యూవల్స్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి అసైన్‌మెంట్ భూములకు కూడా భూమిని బట్టి రుణం పెంచుతున్నామని వెల్లడించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు సైబర్ నేరాలు ఆన్‌లైన్ భద్రత, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. సూపర్ వైజర్ లీలావతి మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. చిన్న వయస్సులోనే బాలికలకు వివాహాలు చేయడం వల్ల అనార్థాలు తప్పవని తల్లిదండ్రులకు వివరించారు. పరిశుభ్రతను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జవాన్ ఆరోపణలు అవాస్తవం

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతు



మాట్లాడుతున్న రైతు లక్ష్మీనారాయణ

ప్రశాంతి నిలయం: తన భూమి కబ్జాకు గురైందని, న్యాయం చేయండని సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జవాన్ చేసిన ఆరోపణలు అవాస్తవమని రైతు లక్ష్మీనారాయణ ఖండించాడు. ఈ మేరకు భూ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని మంగళవారం కలెక్టర్ చేతన్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. అనంతరం వివరాలను మీడియాకు వెల్లడించాడు. గోరంట్ల మండలం పాలసముద్రం పంచాయతీ రాగిమేకలపల్లి రెవెన్యూ గ్రామంలో ఎల్‌పీఎం నంబర్ 72లో పది ఎకరాల పైచిలుకు భూమి తమ పూర్వీకుల నుంచి సంక్రమించినదని, జవాన్ చౌడేష్ తండ్రి, తన తండ్రి సోదరులని, అలా ఆ ఆస్తి ఉమ్మడిగా ఉందని తెలిపాడు. అయితే అందులో ఐదెకరాల భూమిని చౌడేష్ ఎవరికీ తెలియకుండా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, మిగిలిన పొలానికి హక్కుదారులమైన తమకు దారి లేకుండా చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయాడు. క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు.

అన్నదాతకు విత్తన టెన్షన్

రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుకు సిద్ధమవుతున్నారు. నైరుతి రుతు పవనాలు ముందుగానే రావడంతో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వేరుశనగ సాగుకు వర్షాలు చాలా అనుకూలంగా మారాయి. ఇందులో భాగంగానే రైతులు తమ భూములను శుభ్రం చేసుకుని వేరుశనగ సాగుకు సిద్ధమవుతున్నారు. అయితే ప్రభుత్వం ఇంత వరకూ సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో రైతాంగం ఆందోళనకు గురవుతోంది.





ట్రాక్టర్‌తో భూమిని సిద్ధం చేసుకుంటున్న రైతు

- వేరుశనగ విత్తుకు సమీపిస్తున్న గడువు
- ఇంత వరకూ రైతులకు అందని సబ్సిడీ విత్తనం
- సమయానికి విత్తనం అందుతుందో లేదోనని అన్నదాతల ఆందోళన
- విత్తనం కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న వైనం

మడకశిర: నియోజకవర్గంలో వేరుశనగ సాగుకు గడువు సమీపిస్తోంది. రోహిణి కార్తె కూడా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో వారం తర్వాత వేరుశనగ విత్తనాల విత్తును ప్రారంభించడానికి మంచి సమయంగా రైతులు భావిస్తున్నారు. సబ్సిడీ వేరుశనగ విత్తనం కోసం రైతులు ఎదురు చూస్తున్నా ఇంత వరకూ రాష్ట్ర ప్రభుత్వం విత్తన కాయలను అందించలేదు. గత ఏడాది ఈ సమయానికి రైతులకు వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం ప్రారంభించింది. అయితే ఈ ఏడాది మే నెల ముగుస్తున్నా ఇంత వరకూ విత్తన ప్రక్రియ ప్రారంభం కాలేదు. నియోజకవర్గంలోని రైతు సేవాకేంద్రాల్లో విత్తనం కోసం రైతుల పేర్లు నమోదు ప్రక్రియ కూడా మొదలు కాలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సమయానికి విత్తనం అందుతుందో లేదోనని టెన్షన్ పడుతున్నారు.

21,500 క్వింటాళ్లు అవసరం

నియోజకవర్గంలోని 5 మండలాల రైతులకు ఈఏడాది 21,500 క్వింటాళ్ల విత్తన కాయలు అవసరమవుతాయి. ఈమేరకు వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. అయితే ఇంత వరకూ క్వింటాల్ విత్తన కాయలు కూడా మడకశిర నియోజకవర్గానికి రాలేదు.

ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో విత్తన కాయలను అందించడంలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో రైతులు విత్తనం కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అధిక ధరతో విత్తన కాయలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. కొందరులు రైతులైతే కర్ణాటకలో విత్తన కాయలను కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తన పంపిణీలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో రైతులకు శాపంగా మారింది.

రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనం ఇలా...

మండలం	అవసరమైన విత్తనం (క్వింటాళ్లలో)
మడకశిర	5,500
అమరాపురం	5,000
గుడిబండ	5,000
రొళ్ల	3,500
అగళి	2,500
మొత్తం	21,500

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి



వేరుశనగ విత్తుకు గడువు సమీపించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం విత్తన పంపిణీ ప్రక్రియను ప్రారంభించకపోవడం రైతులకు శాపంగా మారింది. విత్తనాన్ని వెంటనే అందిస్తే వాటిని శుభ్రం చేసుకుని సమయానికి విత్తడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం విత్తనం పంపిణీలో నిర్లక్ష్యాన్ని వీడాలి. లేకపోతే రైతులు నష్టపోయేది ఖాయం.

– నాగరాజు, అగళి

రైతుల కష్టాలు పట్టవా?



కూటమి ప్రభుత్వానికి రైతుల కష్టాలు పట్టవా? విత్తన పంపిణీలో ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యం ఎందుకు. వైఎస్ జగన్ హయాంలో సకాలంలో రైతులకు విత్తనాలు అందేవి. అయితే కూటమి ప్రభుత్వం సకాలంలో విత్తన కాయల పంపిణీలో పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి విత్తన కాయలను అందించి రైతులను ఆదుకోవాలి.

– కెంచప్ప, మద్దనకుంట, అమరాపురం మండలం

వచ్చిన వెంటనే పంపిణీ



విత్తన కాయలు వచ్చిన వెంటనే పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటాం. అయితే ఇంత వరకూ విత్తన కాయలు రైతు సేవా కేంద్రాలకు చేరలేదు. విత్తనం కోసం రైతులు ఆర్బీకేల్లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియను ప్రారంభించాం. విత్తన కాయలు త్వరలోనే రైతు సేవాకేంద్రాలకు చేరే అవకాశం ఉంది. రైతులు ఆందోళన చెంద వద్దు.

– కృష్ణమీనన్, ఏడీఏ, మడకశిర

ఆధార్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి

రొళ్ల: గ్రామాల్లో పదేళ్ల వయస్సు పైబడిన చిన్నారుల ఆధార్ రిజిస్ట్రేషన్, అప్‌డేట్స్‌ను వేగవంతం చేయాలని ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అలాగే పదేళ్ల పైబడిన చిన్నారులకు ఆధార్ రిజిస్ట్రేషన్, వేలిముద్రల నమోదు చేయించాలన్నారు. సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటించి ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పని సరిగా బయోమెట్రిక్ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ శ్రీనాథ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



గుడిబండలో యోగా సాధన చేస్తున్న అధికారులు, ప్రజలు

గుడిబండ: ప్రతి ఒక్కరూ రోజూ యోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీఓ కేశవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుడిబండ పట్టణంలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీడీఓ కేశవరెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు కూడా యోగా సాధన చేయడం నేర్చుకోవాలని సూచించారు.

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని సచివాలయం సిబ్బందితో ఎంపీడీఓ రామారావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రోజూ ఆయా గ్రామాల్లోని వారితో యోగా సాధన చేయించాలన్నారు. యోగా చేయడం ద్వారా ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ. విశ్వేశ్వర ఆరాధ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

హిందూపురం: నంద్యాల జిల్లా కృష్ణానది సంగమేశ్వరం వద్ద ఈనెల 31న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని జలసాధన సమితి ఉమ్మడి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఓపిడిఆర్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఇందిరా పార్క్‌లోని కల్లూరు సుబ్బారావు విగ్రహం వద్ద జలసాధన సమితి ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కృష్ణానదిపై సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మాణంతోనే హంద్రీనీవా, తెలుగు గంగా, గాలేరు నగరి ప్రాజెక్టులకు నీటిని తీసుకోవడం సాధ్యమవుతుందన్నారు.

కక్ష సాధింపు తప్ప సంక్షేమమేదీ?

- సీఎం చంద్రబాబు తీరుపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ఆగ్రహం



చిలమత్తూరు: ముఖ్యమంత్రి చంద్రబాబుకు కక్షసాధింపులపై ఉన్న మక్కువ .. పేద ప్రజల సంక్షేమంపై లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకొని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతోందన్నారు. ఏడాది కాలంగా రాష్ట్రంలో వేధింపులు, హత్యలు, అత్యాచారాలు కనిపిస్తున్నాయన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్రం ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. గత ఐదేళ్లుగా లేని కష్టాలు అన్ని వర్గాల ప్రజలూ ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇది రాష్ట్రానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పులు చేసి పంటలు పండించిన రైతులు మళ్లీ రెండో పెట్టే పరిస్థితులు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండానే ఏడాది గడిచిపోయిందని, రేపు, మాపు అని కాలం వెళ్లదీస్తున్నారే తప్ప పథకాలు అమలుకు నోచుకోవడం లేదని మండిపడ్డారు. మరోవైపు సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని, ఆయా శాఖల అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని, ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇలా వ్యవస్థలు అన్నీ గాడి తప్పడం వల్ల ప్రజలకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతులను నొక్కిపెట్టి ప్రతిపక్ష నేతలను అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపుతున్నారన్నారు. ఇలా ఎంతకాలమూ సాగదన్న విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ గుర్తుపెట్టుకోవాలన్నారు. మొన్నటికి మొన్న అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ చాంబర్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించి ఎమ్మెల్యేలు చేసిన హంగామా ప్రజాస్వామ్యానికి చేటుతెచ్చేలా ఉందన్నారు. మాజీ సీఎం జగన్ ఫొటో తమ వ్యక్తిగత చాంబర్‌లో పెట్టుకుంటే తప్పేముందన్నారు. మాజీ సీఎం ఎన్టీఆర్ చిత్రపటాలు చాలా చోట్ల ప్రభుత్వ కార్యాలయాల్లో చూశామని, తాము కూడా అలా ప్రవర్తించి ఉండాల్సిందా అని ప్రశ్నించారు. కూటమి పాలనపై ప్రజలు విసిగిపోయారని అవకాశం కోసం చూస్తున్నారని తెలిపారు. ఇకనైనా కక్షలు మాని ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

హిందూపురం: పట్టణంలోని మున్సిపల్ ఆఫీసు సమీపంలోని సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో అమావాస్య మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి అర్చనలు, పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు వందలాదిగా తరలివచ్చి అభిషేక పూజలతో పాటు ఆలయ ధ్వజస్తంభం వద్ద నాగుల పడగలకు పూజలు చేసి కుంకుమ, పసుపుతో అర్చనలు, అభిషేకాలు చేశారు.

డీలర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు ఉమేష్‌తో ఉపాధ్యక్షుడు నారాయణప్ప, గౌరవాధ్యక్షుడు నరసప్ప

రొళ్ల: మండల నూతన డీలర్ల సంఘం ఎన్నికను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల డీలర్ల సంఘం అధ్యక్షుడిగా దొడ్డేరి డీలర్ ఉమేష్, ఉపాధ్యక్షుడిగా నారాయణప్ప, గౌరవాధ్యక్షుడిగా నరసప్పతో పాటు 23 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. డీలర్ల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరా .. పాహిమాం



హిందూపురం: అలంకరణలో శనీశ్వరుడు



పావగడ: మూల మంత్ర హోమం చేస్తున్న అర్చకులు



పావగడ: కలశ స్థాపన నిర్వహించిన దృశ్యం



అమరాపురంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో శనీశ్వరస్వామి జయంతిని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శనీశ్వరస్వామి మూల విగ్రహాన్ని ప్రత్యేక అలంకరించారు. రుద్రాభిషేకం, నవగ్రహ హోమం, ప్రధాన మూల మంత్ర హోమాలు, గాయత్రి హోమం, మహా పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి శనీశ్వరస్వామి మొక్కులు చెల్లించుకున్నారు.

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం బస్టాండ్ వద్ద ఉన్న శనీశ్వరస్వామి ఆలయంలో స్వామి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు నరసింహభట్టాచార్యులు స్వామి వారికి సుప్రభాతసేవ, తైలాభిషేకం, రుద్రాభిషేకం, నవగ్రహ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి పూజలు చేయించి మొక్కులు చెల్లించారు.

హిందూపురం: స్థానిక డీబీ కాలనీలోని శనీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని మూలవిరాట్ శనేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయంలో గోత్రనామాలతో తిల తైలాభిషేకాలు, కుంకుమార్చనలు చేసి పూజలు చేశారు. సాయంత్రం విశేషంగా జేష్టాదేవి సమేత శనీశ్వరుడి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేశారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	31.0
పెనుకొండ	34.0
మడకశిర	31.0

30న వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

అమరాపురం: పట్టణంలో చెరువు కట్ట ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఈ నెల 30 నిర్వహిస్తున్న మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశానికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సమన్వయకర్త ఈరలక్కప్ప పాల్గొంటారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, మండల కమిటీ సభ్యులు, వివిధ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు, అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'ఈరలక్కప్పను విమర్శించేస్థాయి మీకెక్కడిది?'

అగళి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పను విమర్శించే స్థాయి టీడీపీ దళిత నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈరన్న ఒక ప్రకటనలో విమర్శించారు. అగళి మండలంలో ఏడాది పాలనలో ఏం అభివృద్ధి జరిగిందో టీడీపీ దళిత నాయకులు చూపించాలన్నారు. అభివృద్ధి అంటే మీ దృష్టిలో ఇంటింటికీ సంక్షేమ పథకలను అందించే వలంటీర్లను, ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం, బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలపై వడ్డీ భారం మోపడం, రైతులకు పెట్టుబడి సహాయం అందించకపోవడమేనా? అని ప్రశ్నించారు. జిల్లా స్థాయిలో ఒక బీసీ మహిళపై జరిగిన దౌర్జన్యంపై ఈరలక్కప్ప మాట్లాడితే తప్పెలా అవుతుందన్నారు. ఉపాధిహామీ పనులను యంత్రాలతో చేయడం అభివృద్ధి కాదన్నారు. ఇప్పటికైనా విమర్శలు చేయడం మాని ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి, మండలాభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

సచివాలయాలకు తాళం



గుట్టూరు సచివాలయానికి తాళం వేసిన దృశ్యం

పెనుకొండ రూరల్: మండంలోని గుట్టూరు, మునిమడుగు, కురుబవాండ్లపల్లి, నాగళూరు, గోనిపేట, ఇతర గ్రామాల్లోని సచివాలయాలకు సిబ్బంది తాళం వేశారు. గ్రామాల్లో సేవలు అందిస్తున్న ఉద్యోగులుకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. దీంతో ఉద్యోగులందరూ ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. ఇదిలా ఉండగా.. ముందస్తు సమాచారం లేకపోవడంతో సేవల కోసం వచ్చిన ప్రజలు సచివాలయాల వద్ద నిరీక్షించారు. సచివాలయాలకు తాళం వేయడంతో సెలవు దినమా? లేక పనిదినమా తెలీక వెనుదిరిగారు. దీనిపై ఎంపీడీఓ నరేష్ కృష్ణ వివరణ కోరగా మధ్యాహ్నం వరకూ అన్ని సచివాలయాల సిబ్బంది యోగాంధ్ర కార్యక్రమానికి హాజరైనట్లు పేర్కొన్నారు.


తూకాల్లో తేడా లేకుండా చూడండి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

రొళ్ల: పౌరసరఫరల శాఖ ద్వారా రేషన్ కార్డుదారులకు డీలర్లు తూకాల్లో తేడా లేకుండా నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీతో కలిసి డీలర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షేక్షావలి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు చౌకధాన్యపు డిపోల వద్దనే జూన్ 1 నుంచి 15వ తేదీ వరకూ నిత్యావసర సరుకులు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్డుదారులకు డీలర్లు షాపు వద్దనే అందుబాటులో ఉండాలని సూచించారు. సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ గిరియప్ప, డీలర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యంగిరాదేవి హోమం



అలంకరణలో బోయకొండ గంగమ్మదేవి



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

హిందూపురం: పట్టణంలోని సూరప్ప కట్ట వద్ద ఉన్న బోయకొండ గంగమ్మదేవి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో భక్తుల మధ్య శత్రుసంహారిణి ప్రత్యంగిరాదేవి హోమాన్ని నిర్వహించారు. మోహన్‌స్వామి ఆధ్వర్యంలో అమ్మవారి హోమాలు నిర్వహించి కాళికాదేవికి కుంభపూజ, రక్తాభిషేకం, నరదిష్టి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో అమ్మవారి ఆశీర్వాదాలు అందించారు.